కథానిక

# డిబ్బరాజుగారి అభ్యర్థిత్వం

కొడవటిగంటి కుటుంబరావు

"హలో, హలో, హలో!" అన్నారు శ్రీవారు నన్ను చూస్తూనే. ఆయన బల్ల ముందున్న కాగితాలూ అవీ చూడగానే చాలా పని తొందరలో ఉన్నట్టు నే నర్థం చేసుకోగలిగాను.

"తమరిని కంగ్రాట్యులేట్ చెయ్యటానికి మాత్రమే వచ్చాను. పని చెడగొట్టటానికి కాదు," అన్నాను.

పాదస్తంగా మాట్లాడక పోయే, అన్నట్టుగా ఆయన తన పని మానకుండానే నాకొక ఆసనం చూపారు.

"ఇదంతా మీరు కట్టుకొన్న పుణ్యమే", అన్నారాయన కాస్సేపటికి తల యెత్తి చూసి.

"నేనా?" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును. మీరు నవ్యవాణిలో రాసిన వ్యాసం చూశాకనే నాకు యెన్నికలకు నిలబడాలన్న ఆలోచన కలిగింది."

అవును. నేనా వ్యాసంలో రాజుగారు ఎన్నికలకు నిలబడటంగురించి సపోర్టుచేస్తూ రాశాను. కాని—

"మరయితే తమరు కాంగ్రెసు టిక్కెట్టు పుచ్చుకున్నారు కాదేం? నేను నా వ్యాసంలో—"

చాలెమ్మా అన్నట్టు శ్రీవారు చెయ్యి ఆడించారు.

"నేను కాంగ్రెసు టిక్కెట్టుకోసం ప్రయత్నించక పోవటానికి చాలా కారణాలున్నాయి. ఒకటి, కాంగ్రెసు టిక్కెట్టు అదివరకే ఉలవయ్యకు ఇచ్చేశారు. ఉలవయ్య ప్రచారం ప్రారంభించాడు కూడాను. అతడా ప్రచారం ప్రారంభించటం మనకు లాభించింది!" అన్నారు డిబ్బ రాజుగారు.

"ఎట్లా?" అన్నాను.

ఏదో జ్ఞాపకం వచ్చి రాజావారు పెద్దపెట్టున నవ్వసాగారు. ఆయన్ను చూసి నేనూ నవ్వాను. ఇద్దరం కొంతసేపు నవ్వాక అసలు విషయం బయటికొచ్చింది.

ఉలవయ్య, తనకు టిక్కెట్టు దొరకగానే రాజావారిదగ్గిరికి వచ్చి, తాను ఎన్నికలకు నిలబడుతున్నాననీ, పరమ పవిత్రమైన కాంగ్రెసు టిక్కెట్టు తనకు లభించిందనీ, అంచేత తనకు విజయం తప్పదనీ, ఈ తప్పనిసరి విజయం తన దయేటందుకు రాజావారు సర్వవిధాలా—ముఖ్యంగా డబ్బు రూపంలో—సహాయం పడే పక్షంలో తాను కాంగ్రెసు మంత్రిగా (ఎందుకు కాగూడదు? ఎవరు చూశారు?) రాజావారికి సర్వవిధాలా—వేరే వివరణ లేనికి? సహాయపడగల వాణ్ణని చెప్పాట్ట. ఉలవయ్య దేశభక్తుడూ మోతుబరీ, రైతు కూలీలను గడగడలాడించి ఉన్నవాడూ, కమ్యూనిస్టులను వేటాడినవీరుడూ కనక అతనికి సహాయపడదామని శ్రీవారు నిర్ణయించుకుని అతనికోసం ఒక లక్ష రూపాయలు ప్రత్యేకించడమే గాక దివాణం అధికార్లనూ, పరిపాలనా యంత్రాన్నీ అతని పరం చేసిపెట్టారట. ఈ నిర్ణయానికి రావటంలో శ్రీవారు ఇంకొక ఆలోచన కూడా చేశారు. అదేమిటంటే ఈ సీటుకు స్వతంత్ర అభ్యర్థిగా నిలబడే నలకయ్యను కమ్యూనిస్టులు బలపరుస్తున్నామన్నారు. నలకయ్య మొదటినుంచీ కాంగ్రెసు వ్యతిరేకి. ఒకప్పుడు రాజావారికి కుడిభుజంగా పని చేసినవాడు. కాని కొన్ని కారణాంతరాలవల్ల అతడు కమ్యూనిస్టులను చేరదీయ సాగాడు. కమ్యూనిస్టుల వేట సాగిన సమయంలో నలకయ్య వెంట అరడజను మనుష్యులుంచబడ్డారు. అతని ఇల్లు సదా పోలీసు సోదా అయింది. కాని అతను దొరకలేదు. అతనిమీద ఎటువంటి నేరం మోపటానికి ఆవగింజంత ఆస్కారం దొరకలేదు. పైపెచ్చు ఈ సోదాలమూలంగా అతను కమ్యూనిస్టుల అభిమానం సంపాదించుకున్నాడు.

నలకయ్యవంటి బలవంతుడు —1940లో

కూడా రాజావారికి అతను యెంత కావలిస్తే అంత ఖర్చుతూనే వచ్చాడు—ప్రతిపక్షం కావటము రాజావారికి యెంతమాత్రం ఇష్టంలేదు. కాని అతడు ప్రతిపక్షం అయినాడు గనుక అతన్ని ఓడించక తప్పదు. ఉలవయ్యను బలపరచటం రాజాగారికి తప్పని సరి.

అయితే - ఇక్కడే కథ పెడతిరగసాగింది- ఉలవయ్యమీద జనం అనాదరణ ప్రదర్శించసాగారు. రాజావారి కాంగ్రెస్‌లో ఉలవయ్య అందరి దగ్గిరికి వెళ్ళి తన అభ్యర్థిత్వం గురించి ఘనంగా చెప్పటానికి యత్నించాడు. డబ్బు కోసం అతన్ని బలపరచి సాయం చెయ్య నిశ్చయించినవారు పోగా మిగిలినవాళ్లు నవ్వులు నవ్వసాగారు. కొందరు మిత్రులు కుండపగలేసి, “ఎందుకొచ్చిన హైరాన, నువ్వు గెలవవు,” అని కూడా ఉలవయ్యతో అన్నారు. ఎందుకైనా మంచిది, ఎన్నికలకు కాని కూడా ఖర్చుపెట్టవద్దు. అని మరికొందరు సలహా ఇచ్చారు.

అయితే, రోగికి పథ్యం హితవుకాదుగా. అందుచేత ఉలవయ్య, తనను మూర్ఖులంతా ఏడిపిస్తున్నారని, కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని అనుకున్నాడు. రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికల ప్రచారం సాగించాడు.

మీటింగులు పెట్టాలి. ఉపన్యాసాలు కొట్టాలి. అప్పుడుగాని తన ఘన కార్యాలు చెప్పుకుంటే చాలదు. ఉలవయ్య ప్రచారం చేసుకోవాలి. అప్పుడుగాని విజయలక్ష్మి తనను అనుగ్రహించడం చేసుకోదు.

ఉలవయ్య మీటింగు ఏర్పాటు చేశాడు.

ఈ మీటింగు గురించి చెప్పటానికి రాజావారికి నోట్లు పెక్కువైపోయింది. మీటింగు ఏర్పాట్లన్నీ దివానుగారే చేయించారు. కాని జనం మాత్రం రాలేదు. చిన్న దివాణం నౌకర్లనూ, ఉద్యోగులనూ ఒక వందమందిని అద్దం పెట్టి ఉలవయ్య ఉపన్యాసం ప్రారంభించాడు. మామూలు ప్రజలు కొద్దిమంది వచ్చారు. వాళ్లు కూడా ఉలవయ్యను వెటకారం చేశారు. “ఇంత పెద్ద మీటింగుకు లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేశావు కావేం. ఉలవయ్యా?” అని ఒకరూ, “ప్రతిపక్షాలు పోటీ జరిగినట్టు లేదు, మీటింగు వాయిదా వెయ్యకూడదా?” అని మరొకరూ వేళాకోళం చేశారు. ఉలవయ్యకు లోపల మండిపోతోంది. మీటింగుకు జనం తండోపతండాలుగా వస్తారనుకున్నాడు. రాలేదు.

“ఇదే స్థలంలో నేను 1930లో ఉపన్యసించినప్పుడు అయిదు వేలమంది వచ్చారు. ఇసక వేస్తే రాల్లేదు. ఇవాళ కాంగ్రెసుమీద జనానికెంత అనాదరం ఏర్పడిందో ఈ మీటింగును చూస్తే తెలుస్తుంది. పతనమయింది కాంగ్రెస్ కాదు ప్రజలు!” అని ఉలవయ్య రంకెలు పెడుతూండగానే, అతను కోరిన అయిదు వేలమందీ ఉప్పెన వచ్చినట్టు పడ్డారు. అయితే ఏ కారణంచేతో వాళ్ళతోబాటుగా అయిదు గాడిదలు కూడా వచ్చాయి. ఈ అయిదు గాడిదలూ మీటింగు ప్రవేశించాయనుకోండి. దాంతో సాగింది మైదానం గోల.

“లౌడ్ స్పీకర్లొచ్చాయ్రోయ్!” అన్నారు కొందరు.

గాడిదలకు అట్టలు కట్టారు. “ఉలవయ్యకే నా వోటు”, అని ఒక గాడిదకూ, “నాకే మీ వోటు”, అని మరొక గాడిదకూ, “నేను ప్రజా ప్రతినిధిని. నన్ను పాలించనివ్వండి” అని మరో గాడిదకూ—ఈ విధంగా అట్టలు కట్టారు. జనంలో కలకల ధ్వానాలు చెలరేగాయి. గాడిదలు ఓండ్ర పెట్ట సాగాయి. జనాన్ని తొక్కాయి.

“ప్రజా ప్రతినిధులకూ-జై”, “లౌడ్ స్పీకర్లకూ-జై”, “గాడిదలకూ-జై” అని నినాదాలు సాగించారు జనం. మీటింగు వదిలేసి ఉలవయ్య ఇంటికి వెళ్ళాడు. ఉలవయ్య వెళ్లిపోయిన పదినిమిషాల్లోపుగా గాడిదలు కూడా మాయమైనాయి. ఆ మీటింగు కొస్తా మలకయ్యా మీటింగుగా సాగిపోయింది.

“అంతటితో ఉలవయ్యమీద నాకు విశ్వాసం పోయింది. అతన్ని నమ్ముకున్నట్టయితే లాభంలేదని నిశ్చయించుకుని స్వతంత్ర అభ్యర్థిగా నేనే నిలబడవలిసాను”, అన్నారు రాజావారు.

“ముగ్గురి మధ్య పోటీ కూడా?” అన్నాను.

“లేదు. ఉలవయ్య తన అభ్యర్థిత్వం విరమించుకున్నాడు.”

"రాజులు అభ్యర్థులుగా నిలబడటం గురించి నెహ్రూ అన్నమాట విన్నారా?"

"నెహ్రూ చాలా మాటలన్నాడు. అందులో ఏమీ లేదు. నాకు పోటీగా అభ్యర్థిని నిలబెట్టబోమని స్థానిక కాంగ్రెసువారు లోపాయికారీగా మాట ఇచ్చారు. పోటీ మనకూ నులకయ్యకూ మధ్య ఉన్నది."

"మిమ్మల్ని గెలవకుండా చెయ్యటానికి కమ్యూనిస్టులు శాయశక్తులా ప్రయత్నిస్తారనుకుంటాను", అన్నాను.

"నులకయ్య గెలవకుండా చెయ్యటానికి మనం మటుకు ప్రయత్నించలేమా?"

"ఏమైనా ఆలోచించి పెట్టారా?"

"చాలా సలహాలు వచ్చాయి. వాటిని గురించే ఆలోచిస్తున్నాను. నులకయ్య బాలెట్ పెట్టెకు చిల్లిలేకుండా చెయ్యమని ఒకరి సలహా. నులకయ్యను రెండు రోజులు ముందుగానే ఎరెస్టు చేయించి, పోలింగురోజు ఉదయమే అతను చచ్చిపోయినట్టు ప్రచారం చెయ్యమని ఇంకొకరి సలహా. ఊళ్లో కలరా వచ్చిందని పుకారు పుట్టించమనీ, అట్లా చేస్తే వోటర్లు బయటికి రారనీ మరొక సలహా. ఈ పెద్దమనిషి చూడండి ఇంకో సలహా ఇస్తున్నాడు. "కమ్యూనిస్టులు క్యూలు నిలబెట్టుతున్నారు. ఆ క్యూల మీదికి లారీలనూ, కార్లనూ తోలి చెదరగొట్టండి. తరవాత మనమనుష్యులను క్యూలో నిలబెట్టవచ్చు. కావలిస్తే లారీ డ్రైవర్లను తాత్కాలికంగా ఎరెస్టు చెయ్యవచ్చు! సలహాలకేం చాలా వస్తున్నాయి. మనకు మనసే ఉండాలిగాని మార్గాలు లేకపోతాయా?"

"షేష్! బాగుంది! చాలా బాగుంది! ఇక నేను మీ విజయాన్ని ఆకాంక్షించటం తప్ప వేరే చేయదగిందేమిటి గనకా!" అన్నాను.

నిన్ననే దిబ్బరాజ్యంలో పోలింగు జరిగింది. నాలుగు రోజులనుంచీ నులకయ్య జైల్లో ఉన్నాడు. మొన్నటినుంచీ అక్కడ కలరా ఉధృతంగా ఉన్నట్టు పత్రికల్లో చదివాను. పోలింగు సమయంలో లారీ ఒకటి కంట్రోలు తప్పి వోటర్ల క్యూ మీదికి పోయినట్టూ ఇద్దరు గాయపడ్డట్టూ తెలుస్తున్నది. కాని వోటర్లు నిరుత్సాహం చెందలేదు. నిశ్చలంగా నిలబడి వోటు చేశారు. నూటికి 95 వంతులు వోట్లు పోలయినట్టు అంచనా. దిబ్బరాజుగారికి డిపాజిట్ దక్కదని ఒక వదంతి. గిట్టనివాళ్ళు ఇటువంటి వదంతులు వేస్తారు. ఎన్నికల ఫలితాలు పత్రికలో పడినదాకా మనమేమీ అనకోరాదు.

కథానిక

# గర్వకారణం

ప్రేమంరాజు కృష్ణమోహన్

మా వూరి ప్రజలు సామాన్యులు కారు. మా గ్రామంలో ధనిక భూస్వాములున్నారు. మధ్యతరగతి రైతులున్నారు. పేద ప్రజలున్నారు. ఇద్దరు సంస్కృత పండితులున్నారు. స్కూలుఫైనలు కొద్ది మార్కులు తక్కువతో మూడుసార్లు తప్పిన ఘనులు ఇద్దరున్నారు. మా వూరి ప్రజలు అన్ని రాజకీయపక్షాలకు చెందినవారు. విచిత్రమేమంటే జెండాలు మాత్రమే మావూళ్లో లేవు. కాబట్టి మా వూరివాళ్ళు రాజకీయ మేధావులు. అందులో సందేహం లేదు. నిదర్శనం కావాలా మీకు? అయితే సావధానంగా వినండి. ఇప్పుడు మిమ్మల్ని, మమ్మల్ని, పీక్కుతింటున్న సమస్య ఒక్కటే. అది ఎలెక్షన్ల గొడవ. ఈ మధ్యనే మా గ్రామప్రజలు ఒక విచిత్రమైన నిర్ణయానికి వచ్చారు. అదేమిటంటే అన్ని పార్టీల నాయకుల్ని మావూరికి పిలవడం, ఉపన్యాసాలిప్పించడం, ప్రతి ఒక్కరి ఉపన్యాసం అవగానే ఆలోచించి వోటివ్వటం ఖాయమైతేనే చప్పట్లు కొట్టడం. మేం గ్రుడ్డిగా చప్పట్లు కొట్టం.

Source: Press Academy Website, Telugu Swatantra Patrika, Feb 1952

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/